# అంచనాలకు అందనివాడు

యస్.యం. బాషా*

అక్టోబర్ 8, 2009 మానవీయ విలువల్ని ప్రేమించే వారినీ, హక్కుల కార్యకర్తలనీ తీవ్ర దు:ఖానికి గురిచేసిన రోజు. ఐదు రోజుల మునుపు అనంతపురంలో హెచ్ఆర్ఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభలు ఎంతో ఉత్సాహభరితంగా జరిగాయి. అప్పటికి ఆరోగ్యంగా ఆనందంగా ఉన్న మనిషి ఈ లోపే ఆకస్మిక మరణానికి గురయ్యాడంటే మాకెవరికీ నమ్మశక్యం కాలేదు.

అనంతపురం సభల్లో వర్తమాన సామాజిక పరిస్థితులపై ఆయన చేసిన విశ్లేషణ, సమస్యల ప్రస్తావన కొత్త, పాత సభ్యులందరినీ తీవ్రమైన ఆలోచనల్లోకి పడవేసాయి. సమకాలీన రాజకీయాల్లో భయం, అభద్రతలు ప్రజల్ని వాస్తవ పరిస్థితుల గురించి మాట్లాడకుండా శాసిస్తున్న వైనాన్ని ఆరోజు ఆయన బహిరంగ సభలో చేసిన ప్రసంగం ప్రస్తావించింది.

బాలగోపాల్‌ని అంచనా వేయగల సమర్థత, ధైర్యం నాకు లేదు. ఆయన మేధస్సునీ, విజ్ఞానాన్నీ అంచనా వేయగల తూనికరాళ్ళు నావద్ద లేవు. ఒక మాట మటుకు హక్కుల కార్యకర్తగా నేను చెప్పగలను. హక్కుల ఉద్యమంలో కార్యకర్త, నాయకుడు అన్న తేడా లేకుండా పని చేసిన వాడు బాలగోపాల్. రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎంతోమంది సామాజిక మేధావులున్నా బాలగోపాల్‌నే ప్రజలు విశ్వసించడానికి కారణమేమయి ఉంటుందో తేలిగ్గానే ఊహించగలం. అందరికీ మార్గదర్శకంగా ఉండే ఆయన వ్యక్తిత్వమూ, పని విధానమే దానికి కారణం. కార్యాచరణా, విలువల ఆచరణా ఆయన వ్యక్తిత్వంలో మిళితమై పోయాయి.

చాలామందిలాగే బాలగోపాల్ గారితో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం నాకుంది. ఛత్తీస్‌గఢ్, మణిపూర్, కర్నాటకలలో హక్కుల కార్యరంగంలో

* మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనంతపురం

భాగంగా పర్యటించాము. తిండీతిప్పలూ, పడక విషయంలో మేం ఆయనతో పడలేక విసుక్కున్న సందర్భాలున్నాయి. సౌఖ్యాన్ని ఏనాడూ కోరడు. ఒక పూటైనా మంచి భోజనం తినిపిస్తాడా లేదా అని అనుకునేవాళ్ళం. పగలంతా తిరిగి అలసిపోయినా రాత్రంతా మేల్కొని నివేదికలు రాసేవాడు. గొప్ప పని రాక్షసుడు. ఇవన్నీ సామాన్యంగా అనిపించే విషయాలు అనిపించవచ్చు కాని వ్యక్తిత్వం నిర్ధారణకు ఇటువంటి విషయాలు కూడా తోడ్పడతాయి.

శ్రీకాకుళ ఉద్యమ నేపథ్యంలో హక్కుల సంఘం తెరమీదకి వచ్చింది. కాలక్రమేణా ఉద్యమ నిర్బంధంపైనే కాకుండా సాధారణ ప్రజానీకం ఎదుర్కొంటున్న నిర్బంధం, హింసలను వ్యతిరేకించే కార్యక్రమాల్ని కూడా చేపట్టే వైఖరిని హక్కులసంఘాలు తీసుకున్నాయి. తర్వాత కాలంలో హక్కుల సంఘాలు స్వతంత్రంగా ఏర్పడాలని, పనిచెయ్యాలని ఆలోచనలు వ్యక్తమయినా ఆచరణలో మాత్రం రాజకీయ పార్టీల కనుసన్నల్లోనే పనిచేసాయి. హక్కుల సంఘాలు స్వతంత్ర సంస్థలుగా ఎదగడానికి పార్టీలు ఇష్టపడలేదు. పార్టీలు ఇష్టపడటం లేదనడం కంటే, హక్కుల సంఘాల్లో పనిచేస్తున్న నాయకులు కూడా పార్టీల ప్రాపకాన్ని వదులుకోవడానికి ఇష్టపడలేదు.

పార్టీల ప్రమేయంవల్ల హక్కుల కార్యాచరణలో ద్వంద్వ ప్రమాణాలు పాటించాల్సి రావడంతో నిజమైన ప్రజాతంత్ర సంస్థలుగా ఎదగడంలో హక్కుల సంఘాలు అవరోధాలు ఎదుర్కొన్నాయి. ఆ తర్వాత తెలంగాణలో ప్రభుత్వం నక్సలైట్ కార్యకర్తలపై, సామాన్య ప్రజలపై ప్రయోగిస్తున్న రాజ్యహింసకు ప్రతిగా ఆయా పార్టీలు అమలుపర్చే హింసా పద్ధతులపై చర్చ మొదలయ్యింది. ప్రజల మీద జరిగే అన్ని హింసా రూపాల్ని ఖండించవలసిందే అన్నది బాలగోపాల్ విశ్వాసం. ఆయన వాదనను అంగీకరించని వీరశైవులు కొందరు అంగీకరించకపోతే అంగీకరించకపోయారు, ఆయనపై ఆరోపణలకు దిగారు. మరొకరయితే ఆ ఆరోపణల తీవ్రతకీ, దాడికీ తట్టుకోలేక నమస్కారంపెట్టి వెళ్లిపోయి ఉందురు. కానీ బాలగోపాల్ అలా చేయలేదు. తాను నమ్మిన విలువలకు కట్టుబడ్డారు. విలువల మేరు పర్వతమై నిలబడ్డారు. ఆ తర్వాత మాలాంటి వాళ్లందరితో కలిసి మానవహక్కుల వేదిక ఏర్పాటు చేశారు. స్వతంత్ర హక్కుల సంస్థగా మానవహక్కుల వేదికను ఆయన నడిపించిన తీరు అసామాన్యమైనది. ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో ఆయన అనంతపురం మహాసభల్లో ప్రధాన కార్యదర్శి పదవిని వద్దనుకున్నాడు.

బాలగోపాల్ గురించి ఇలా ఎంతైనా చెప్పుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే బాలగోపాల్ పరిపూర్ణ మానవుడు. తనకు తానుగా ఒక మంచి మానవునిగా జీవితం గడిపిన వాడు.